క్లుప్తంగా

టేకుమందలో జగనన్న ఆరోగ్య సురక్ష రేపు

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్యశిబిరం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తిచేయండి


ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికి ఇళ్ల స్థలాలు కేటాయించగా వాటిని రిజిస్ట్రేషన్ చేసి ఆస్తిగా వారికి అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎంపీడీఓ గౌరి తెలిపారు. బుధవారం మండలంలోని సచివాలయాల్లో నవరత్నాలు పేదలందరికి ఇళ్ల స్థలాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా పట్టాలు రిజిస్ట్రేషన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ ఏఓగా అంజయ్య


అంజయ్య

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ పరిపాలనాధికారిగా ఇ.అంజయ్య నియమితులయ్యారు. ఇక్కడి పరిపాలనాధికారి వై.శ్రీనివాసులు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో అదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అంజయ్యను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల సేవలు భేష్


అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో ఢిల్లీ డాక్టర్ల బృందం

పుంగనూరు: పట్టణంలో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ, సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్స్ ఢిల్లీ బృందం డాక్టర్లు శ్రీనాథరెడ్డి, రాజేశ్వర్, నిరంజన్‌రెడ్డి కితాబిచ్చారు. పట్టణంలోని హెల్త్ సెంటర్లను బృందం పరిశీలించింది. రోగులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్లు, మందులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఒంటరి ఏనుగు బీభత్సం


ధ్వంసమైన బోరు బావిని చూపుతున్న బాధిత రైతు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీలో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగు పెనుగొలక రైతులకు చెందిన వెంకటరత్నం వ్యవసాయ బోరు బావిని ధ్వంసం చేసింది. బోరు పైపులను విరిచేసి మోటర్‌ను, కేబుల్ వైరును బోరు బావిలోకి తోసేసింది. అలాగే పెద్దకాప్పల్లెకు చెందిన రమణా రెడ్డి తదితరులు సాగు చేసిన వరి పంటను తొక్కి నాశనం చేసింది. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతులు ఏనుగు విధ్వంసాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. గజ దాడిలో సుమారు రూ.50వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సారా విక్రేతల అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో బుధవారం సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. రాయలపేట మొండి వీధిలో రాజేశ్వరి, రాధ అనే ఇద్దరు మహిళలు సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు చేసి, వారి నుంచి ఐదు లీటర్ల సారా (50 ప్యాకెట్లు) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

4న వాలీబాల్ టోర్నీ

వి.కోట: మండలంలోని జవునపల్లె గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 4న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విన్నర్స్‌కు రూ.9,999, రన్నర్స్‌కు రూ.7,777, మూడు, నాలుగవ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.3,333, రూ.2,222 నగదు బహుమతులుగా ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఆసక్తిగల జట్లు 3వ తేదీ లోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సంప్రదించాల్సిన సెల్ నంబర్లు:6302169512, 8008009071.

వైఎస్సార్ సీపీని ఆదరించండి

- చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి


మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రాలు ఇస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత నిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథం వైపు నడిపిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి రాబోవు ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. బుధవారం గుడిపాల మండలంలోని పానాటూరు పంచాయతీలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని సంక్షేమ పథకాల కరపత్రాలతో కరపత్ర ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకెళ్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అమ్మ ఒడి, దశల వారీగా పింఛన్ల పెంపు, వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు, విద్యాదీవెన, వసతిదీవెనలతో పాటు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, వడ్డీలేని రుణాలు..మొదలైన వాటిని ఉదహరించారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని మేలు పొందిన ప్రతి కుటుంబం తమను ఆశీర్వదించాలని మహిళలను కోరారు. చంద్రబాబునాయుడు మాటలను ఎవరూ నమ్మడం లేదని, 2014లో రుణమాఫీ పేరిట నట్టేట ముంచారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, డెప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జ్యోతిరెడ్డి, మొగిలిరెడ్డి, మధుసూదన్‌రాయల్, గోళ్లహరిప్రసాద్, రజనీకాంత్, రెడ్డప్ప, రవియాదవ్, శిలంబరసన్, భానుమూర్తిరెడ్డి, హరిబాబు, చిట్టిబాబు, కారిమేఘన్, డానియల్, మనోహర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సెల్వం, కలైఅరసి, ప్రవీణ్, వెంకిరెడ్డి, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులకు అన్నింటా అగ్రతాంబూలం


భూమిపూజ చేస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: దళితులు, బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నింటా అగ్రతాంబూలం ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఇరువారంలో గ్రామస్తుల ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ భూమి పూజకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి దళిత సంఘాల నాయకులు, స్థానిక నేతలతో కలిసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యావత్తు దేశం గర్వించేలా ప్రపంచంలోనే ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి ఏర్పాటు చేయడం, పదవుల్లో, పనుల్లో దళితులకు సమాన ప్రాధాన్యతనిస్తున్న జగనన్న అభినవ అంబేడ్కర్‌గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగనన్నను తిరిగి సీఎం చేసుకుంటే బడుగు, బలహీనవర్గాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇదలా ఉంచితే, నగర పరిధిలో ఉన్నప్పటికి ఇరువారంలో ఇప్పటికీ గ్రామ సంప్రదాయాలు పాటిస్తుండటం అభినందనీయమన్నారు. నెలరోజుల్లో విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, యాదమరి ఎంపీపీ సురేష్, దళిత సంఘాల నాయకులు మునస్వామి, దాము, దాసు, వరదరాజులు, అన్బు, స్థానిక నాయకులు డేవిడ్, మనోహర్, మహి, మార్కొండేయ, జయకుమార్, కుట్టి, మదన్, ఖాదర్‌బాషా, సూరిరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యంరెడ్డి, మోహన్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

- కలసికట్టుగా పనిచేసి జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం
- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్


సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: కార్యకర్తలే వైఎస్సార్‌సీపీ మూల స్తంభాలని, విభేదాలు విడనాడి కలసికట్టుగా పనిచేసి జగనన్నను మరోసారి సీఎంగా చేసేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ ఎం.సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కాణిపాకం రోడ్డులోని నారాయణాద్రి కల్యాణ మండపంలో ఐరాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిచయం, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత పూజారిమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టి బైక్ ర్యాలీగా కల్యాణ మండపానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ ఆప్యాయంగా అందరినీ పరిచయం చేసుకొని పలకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ తోడేలు గుంపుల్లా ఎంత మంది ఒక్కటై వచ్చినా సింహం ఒక్కటే గెలుస్తుందని స్పష్టం చేశారు. చంద్రబాబు అధికార దాహంతో కుటుంబాలను చీల్చి మూకుమ్మడి దాడికి పాల్పడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి చేసిన మేలుకు ప్రజలు ఆదరించి మరోసారి అధికార పీఠం ఎక్కిస్తారని ధీమా వ్యక్తం చేశారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175 సీట్లు స్వీప్ చేసి మరో సారి జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించేందుకు ప్రతి ఒక్కరూ పార్టీకి విధేయుడిగా పని చేయాలన్నారు. రానున్న ఎన్నికల సమరంలో ఐరాల మండలంలో 10 వేలు, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి 40 వేల ఓట్ల మెజారిటీ సాధించి పార్టీ ఎమ్మెల్యేను గెలిపించుకోవాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో కాణిపాకం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ మోహన్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, ఐరాల మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, తవణంపల్లె మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి, ఐరాల ఎంపీపీ మోహన్, జెడ్పీటీసీ సుచిత్ర, వైస్ ఎంపీపీలు, పార్టీ నేతలు చంద్రశేఖర్ రెడ్డి, శాంతిసాగర్‌రెడ్డి, చిన్నారెడ్డి, చరణ్‌రెడ్డి, అవిష్‌రెడ్డి, ధనంజయ, సుదీర్ పాల్గొన్నారు.


హాజరైన పార్టీ శ్రేణులు

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌లో కొళాయిలను ప్రారంభిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: మండలంలోని పానాటూరులో బుధవారం వాటర్‌ప్లాంట్‌ను చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి ప్రారంభించారు. పానాటూరు పంచాయతీ ప్రజల విజ్ఞప్తిపై స్పందించి ఆయన సుమారు రూ.5లక్షలు వెచ్చించి దీనిని ఏర్పాటు చేశారు. అలాగే గుడిపాల, తాళంబేడు, నాయనిచెరువులో కూడా త్వరలో వాటర్ ప్లాంట్లను ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. శుద్ధజలం తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

యాదమరి: మండల కేంద్రంలో గురువారం పూతలపట్టు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ మండల వైఎస్సార్ సీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని శివపార్వతి కల్యాణ మండపంలో నిర్వహించే ఈ ఆత్మీయ సమావేశానికి డాక్టర్ సునీల్‌కుమార్‌తోపాటు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఆత్మీయ సమావేశానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరు హాజరు కావాలని కోరారు.

రైలులో కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడి అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

చిత్తూరు కార్పొరేషన్: రైలులో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కథనం... బెంగుళూరు నుంచి కాకినాడకు వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేశారు. బెంగళూరు నుంచి బాపట్లకు వెళుతున్న ప్రయాణికుడు సుజిత్ (30) బ్యాగ్‌ను పరిశీలించగా కర్ణాటక మద్యం 16 ఫుల్‌బాటిల్స్ ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాసనపల్లెలో ‘ఫ్యామిలీ ఫిజీషియన్’


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇళ్ల వద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. బుధవారం రాసనపల్లెలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది శిరీష, అన్నపూర్ణ, సుధ, మల్లిక పాల్గొన్నారు.

వీధి బాలల భవితకు కృషి చేద్దాం

పుంగనూరు: వీధి బాలలను గుర్తించి వారికి చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని జూనియర్ సివిల్‌జడ్జి సింధు కోరారు. బుధవారం స్థానిక దోబీకాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో వీధి బాలలపై సదస్సు నిర్వహించారు. సింధు మాట్లాడుతూ, వీధి బాలల భవితకు తోడ్పాటు నిచ్చే వారి సహకారంతో బాలలను సంక్షేమ హాస్టళ్లలో చేర్పించాలన్నారు. వారికో మంచి జీవితం ప్రసాదించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. వీధి బాలలను కార్మికులుగా వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలన్నారు. ఏఎస్‌ఐ గౌరీశంకర్, హెచ్‌ఎం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు అందించాలి

- సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురండి
- జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్

యాదమరి: ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల ఫలాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందించాలని, గ్రామాల్లో సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకరావాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ సురేష్‌బాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా మండలంలో మూడు నెలలుగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీలకు అతీతంగా కుల మతాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. అలాగే మండలంలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ రాక ముందే నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవాలు చేయాలన్నారు. వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, ఎంపీడీఓ శివరాజ్, తహసీల్దార్ హనుమంతు, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించారన్నారు. అందరూ దీనికి సిద్ధంగా ఉండాలని ఎంపీటీసీలను, సర్పంచ్‌లను జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు సమావేశం నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ శాసన సభ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ గడప గడపకు వెళ్లి జగనన్న గత నాలుగు సంవత్సరాలుగా ఇచ్చిన సంక్షేమ పథకాల ఫలాలను వివరించాలన్నారు. జగనన్న సీఎం అయితేనే ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబు నాయుడు వస్తే అన్ని ఆపేస్తారని తెలియజేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

- హోరాహోరీగా తలపడిన జట్లు
- ముగిసిన ఖో–ఖో, వాలీబాల్ పోటీలు


చిత్తూరు-పలమనేరు జట్ల క్రీడాకారుల మధ్య జరుగుతున్న కబడ్డీ పోటీలు


చిత్తూరు-పలమనేరు మహిళా జట్ల కబడ్డీ ఫైనల్స్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో బుధవారం ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు కొనసాగాయి. జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు, నగరి, జీడీ నెల్లూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల నుంచి కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడలకు పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు క్రీడాపోటీల్లో 40 మ్యాచ్‌లకు షెడ్యూల్ ఇచ్చారు. రాత్రి 9.30 గంటల సమయానికి 28 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. మిగిలిన మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు.

ఖో–ఖో విన్నర్స్ పలమనేరు, పూతలపట్టు

ఖోఖో పోటీలు రసవత్తరంగా సాగాయి. పురుషుల విభాగం ఫైనల్స్‌లో పలమనేరు–పూతలపట్టుపై విజయం సాధించింది. కుప్పం మూడవ స్థానంలో నిలిచింది. ఇక మహిళల విభాగం ఖో–ఖో ఫైనల్స్‌లో పూతలపట్టు–పలమనేరుపై గెలుపొందింది. మూడవ స్థానంలో జీడీ నెల్లూరు జట్టు నిలిచింది.

వాలీబాల్ విన్నర్స్ చిత్తూరు, పలమనేరు

వాలీబాల్ పోటీల్లో పలు నియోజకవర్గాల జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన పురుషుల విభాగం ఫైనల్స్‌లో చిత్తూరు–పుంగనూరుపై విజయం సాధించింది. జీడీ నెల్లూరు జట్టు మూడవ స్థానంలో నిలిచింది. మహిళ విభాగంలో పోటీల్లో పలమనేరు–పూతలపట్టుపై గెలిచింది. నగరి మూడవ స్థానంలో నిలిచింది.

మహిళల కబడ్డీ విభాగం ఫైనల్స్‌లో రగడ –పుంగనూరు జట్టుపై వేటు

మహిళల విభాగం కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. అయితే ఫైనల్స్‌లో జట్ల నడుమ నడుమ వాగ్వాదాలు చోటుచేసుకుని చాలాసేపు పోటీలు నిలిచిపోయాయి. ఫైనల్స్ చిత్తూరు, పుంగనూరు జట్లు చేరాయి. అర్హత లేని ప్రాంతాలకు చెందిన వారు పుంగనూరు జట్టులో ఆడుతున్నారని చిత్తూరు మహిళల జట్టు ఆరోపించడంతో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. పుంగనూరు జట్టు క్రీడాకారిణులు ఆధార్‌కార్డులను చూపించినప్పటికీ వారిని ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరికి వారిని పోటీల నుంచి తొలగించి తదుపరి జట్టుతో పోటీలు ప్రారంభించారు. తర్వాత ప్రారంభమైన చిత్తూరు, పలమనేరు జట్ల మధ్య పోటీలు కొనసాగాయి. ఈ పోటీల్లో చిత్తూరు జట్టును విజేతగా ప్రకటించారు. పురుషుల కబడ్డీ పోటీల్లో నగరి, పూతలపట్టు జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి.


చిత్తూరు- పుంగనూరు క్రీడాకారుల నడుమ వాలీబాల్ ఫైనల్ పోటీలు


ఖో–ఖో ఫైనల్స్‌లో తలపడిన పలమనేరు–పూతలపట్టు క్రీడాకారులు


పలమనేరు–పూతలపట్టు మహిళల మధ్య వాలీబాల్ ఫైనల్స్